

5న హాస్టల్ వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి-పాడేరు:గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని జూన్ 5న ఐటిడిఎ ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు సిఐటియు వెల్లడించింది. ఈ మేరకు బుధవారం పాడేరులో హాస్టల్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, వేసవిలో పాఠశాలలకు సెలవులు ఉన్నా వర్కర్స్‌కి సెలవులు లేవని, వీరు 24 గంటలు విధులు నిర్వహిస్తు న్నారన్నారు. వేతనం మాత్రం చాలీచాలని వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ సీనియార్టీ ప్రకారం పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్లో పనిచేస్తూ మృతి చెందిన కార్మిక కుటుంబాల్లో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేస్ యాప్ హాజరు నుండి కార్మికులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. క్యాజువల్ లీవులు ఇవ్వాలని, వంట దగ్గర పని చేసే కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐదో తేదీన జరిగే ధర్నాను కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అక్రమంగా ఇసుక రవాణా

▸▸అధిక ధరలకు అమ్మకాలు ▸▸ పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలో గెడ్డలు గుళ్ళ బారుతున్నాయి. కొందరు అక్రమ మార్కులు ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వేసి లాభాలు గడిస్తున్నారు. మండలంలోని తీగలవలస పంచాయతీ మగంబంద, పాములరాయి, కామయ్యపేట గ్రామాలకు సమీపంలో గెడ్డల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ మూడు గెడ్డల నుంచి అధికంగా పాడేరు, హుకుంపేటలకు తరలిస్తున్నారు. లారీ ఇసుక ధర హుకుంపేట సమీప ప్రాంతాల్లో రూ.6500 కాగా పాడేరు, ఇతర ప్రాంతాల్లో రూ. 12 వేల వరకు అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం. మారుమూల పట్టాం, బూర్జ, గత్తుం, జార్ర కొండ, మెరకచింత, గన్నేరు పుట్టు, అండిభ, దుర్గం బంధలు తదితర పంచాయతీల ప్రాంతాల్లో ఒక లోడు లారీ 12000 వరకు తీసుకుంటున్నట్లు తెలిసింది.



వాహనాల్లో తరలిస్తున్న ఇసుక

ట్రాక్టర్ ఇసుక ధర 4500 నుంచి 5వేల వరకు అమ్మకాలు చేపడుతున్నారు. రెవిన్యూ అధికారులు పట్టించుకోక పోవడంతో ఇష్టా రాజ్యాంగ సాగుతుంది. వ్యాన్లు, ట్రాక్టర్లు, లారీలు ఏకంగా గెడ్డలకు వెళ్లి ఇసుకను లోడ్ చేసుకుని దర్జాగా తిరుగుతున్నాయి. అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దిగుడుపుట్టు, రాళ్లగడ్డ, పెద్దగరువు వంతెన వద్ద రోజుకు సుమారు 40 వాహనాల్లో రవాణా జరుగుతోంది. ఇదిలా ఉండగా మండలంలోని తీగల పంచాయతిలోనే కామయ్యపేట, మంగబంద, పాములరాయి సమీప గెడ్డలలో అత్యధికంగా ఇసుకకు డిమాండు ఉంది. మంచి ఇసుక దొరుకుతుండడంతో.



గెడ్డలో వేసిన ఇసుక పోగులు

పాడేరు, హుకుంపేట పరిసర ప్రాంతాల వాహనాలు అధికంగా వస్తున్నాయని గ్రామస్తులు అంటున్నారు. రోజుకు 100కు పైచిలుకు లోడ్లు ఇసుక తరలిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. లోడ్ వాహనాలు వేగంగా నడుపుతుండడంతో ఊరు పక్కనున్న పిల్లలు ఇటు అటు తిరిగేందుకు భయపడుతున్నారు. మరోపక్క వంతెన వద్ద ఇష్టానుసారంగా ఇసుకను తవ్వడంతో బ్రిడ్జిలు దెబ్బతింటున్నాయి. కొన్ని చోట్ల ఇప్పటికే బీటలు వారిన ఘటనలు ఉన్నాయి.

టోకెన్లు తీసుకోవాలి

పంచాయతీ కార్యదర్శి సాగర్, విఆర్వో నూకరత్నంలను వివరణ కోరగా పంచాయతీలో ఎటువంటి రుసుములు చెల్లించకుండానే ఇసుకను తరలిస్తున్నారు. తమకు ఎటువంటి సమాచారం లేదని వారు తెలిపారు. పంచాయతీ పరిధిలోటోకెన్లు తేసుకోవలసి ఉందని వారు అన్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టు వేయాలని, రాత్రి పగలు తరలిస్తుండగంతో గెడ్డలు లోతుకి వెళ్ళి పోతుందని గ్రామ ప్రజలు తెలిపారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రోజురోజుకి ఇసుకను తీయడంతో వంతెనలు, రహదారులు ప్రమాదాల బారిన పడుతున్నాయని తెలిపారు.

గిరిజన హాస్టల్ అవుట్ సోర్సింగ్ వర్కర్లకు
సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

సిఐటియు ఆధ్వర్యాన ఐటిడిఎ పిఒకు వినతి



పిఒ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేస్తున్న హాస్టల్ వర్కర్లు

ప్రజాశక్తి- చింతూరు : డివిజన్‌లోని గిరిజన సంక్షేమ హాస్టల్స్‌లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధానకార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం హాస్టల్ వర్కర్స్‌తో సమావేశం నిర్వహించారు. అనంతరం సిఐటియు ఆధ్వర్యాన ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరేను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ, విద్యార్థుల సంఖ్య అనుగుణంగా హాస్టళ్లలోవర్కర్ పోస్టులను భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న మూడేళ్ల యూనిఫారాలను పంపిణీ చేయాలని కోరారు. హాస్టల్ వర్కర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి, మండల యూనిట్‌గా బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, రోజూ 12 గంటల నుంచి 13 గంటల వరకు పనిచేస్తున్న ఆశ్రమ పాఠశాల వర్కర్లుకు హాస్టల్ ప్రాంగణంలో వసతి సౌకర్యాలు లేకపోవడంతో బయట రూమ్స్ తీసుకొని ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. హాస్టల్ వర్కర్ల సమస్యలపై పిఒ స్పందించి, ప్రభుత్వపరంగా న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

హాస్టల్ వర్కర్స్ యూనియన్ డివిజన్ కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా గిరిజన హాస్టల్స్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ చింతూరు డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కారం చంద్రమ్మ, కార్యదర్శిగా సోడి దుర్గారావుతో కూడిన 13మంది కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో చింతూరు సిఐటియు నేతలు వై. శ్రీనివాసరావు, పి. లక్ష్మణ్, హాస్టల్ వర్కర్లు రమాదేవి, వీరయ్య, చెల్లమ్మ, చంద్రయ్య, లచ్చుమ్మ, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాలను పూర్తిచేయాలి

మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సూర్యలక్ష్మి

ప్రజాశక్తి -హుకుంపేట:నాడు నేడు ద్వారా నిర్మాణం చేపడుతున్న అంగన్వాడి భవనాలను త్వరగా పూర్తి చేయాలని అల్లూరి జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.సూర్యలక్ష్మి సూచించారు. మండలంలోని అడపరాయి, మారేలా, పనసపుట్టు, సోడా తదితర ప్రాంతాల్లో ఉన్న గ్రామాలను నాడు నేడు ద్వారా నిర్మాణం చేపడుతున్న అంగన్వాడి భవనాలను స్థానిక సిడిపిఓ సిహెచ్ బాలమణి దేవితో కలిసి బుధవారం ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సూర్యలక్ష్మి మాట్లాడుతూ, నాడు నేడు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. మహిళా పోలీసులు సచివాలయం పరిధిలో ఉన్న అంగన్వాడి భవవాలను ప్రతివారం సందర్శించి ఫోటోలు అప్లోడ్ చేయాలని ఆమె సూచించారు.నాసిరకంగా పనులు చేపడితే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.భవన నిర్మాణ పనుల్లో రోజువారి వాటరింగ్ చేసేటట్లు స్థానిక ఆయా, ఆశ వర్కర్లు పూర్తి బాధ్యత వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఐసిడిఎస్ పిడి సిహెచ్ బాలమణి దేవి, సూపర్వైజర్లు అంగన్ టీచర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న అధికారులు



బురదమయంగా ఉన్న రోడ్డు

అస్తవ్యస్త రహదారితో అవస్థలు

ప్రజాశక్తి -డుంబ్రిగూడ:మండల కేంద్రంలోని మామిడి చెట్టు వీధిలో రోడ్డు అస్తవ్యస్తంగా ఉండటంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ సిసి రోడ్డు, వీధి కాలువ నిర్మించక పోవడంతో ఆ వీధిలోని వారు ఉపయోగించిన వాడుక నీరంతా రోడ్డుపైకి వచ్చి నిల్వ ఉంటుండడంతో అది ఊట గెడ్డను తలపిస్తుంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గుబేలుపేటలో నీటి సౌకర్యం కల్పన

'ప్రజాశక్తి' కథనానికి స్పందన



మరమ్మతులు చేసిన కుళాయిలు

ప్రజాశక్తి- చింతూరు : మండల కేంద్రంలోని గుబెలుపేటలో విద్యుత్, తాగునీరు, ఇతర సమస్యలపై అధికారులు స్పందించి, వాటిని పరిష్కరించారు. ఇటీవల ప్రజాశక్తిలో ప్రచురితమైన గుబేలుపేటలో తాగునీటి కటకట, వెలగని వీధిలైట్లు కథకానిని స్పందించిన అధికారులు, గుబేల్‌పేటలో పైపులైను ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యాన్ని పునరుద్ధరించారు. అలాగే వీధిదీపాలను ఏర్పాటు చేసి, గుబేలుపేటలో అంధకారం సమస్యను పరిష్కరించారు.సమస్యలను వెలుగులోకి తెచ్చిన ప్రజాశక్తికి, పరిష్కారానికి చొరవచూపిన అధికారులు, సిబ్బందికి గుబేలుపేట వాసులు కృతజ్ఞతలు తెలిపారు.



మానవహారం చేపడుతున్న వైద్య అధికారులు, సిబ్బంది

పొగాకు అనర్థాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-పాడేరు: వరల్డ్ నో టొబాకో డే ను పాడేరులో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సి జమాల్ బాషా ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్సీడీ పీఓ డాక్టర్ భారతీ కుమారి దేవి హాజరయ్యారు. ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వద్ద వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తూ, జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. పాత బస్టాండ్ వద్ద మానవ హారం నిర్వహించి పొగాకు వినియోగం విడనాడాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డ్రగ్ అడిక్షన్ సెంటర్ వైద్యాధికారులు మాట్లాడుతూ, పొగాకు వాడటంతో కలిగే దుష్ప్రభావాలను వివరించారు.పొగాకు ఉత్పత్తుల వాడకమునకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఏ.ఎస్.ఆర్ జిల్లాలో పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని గణనీయంగా తగ్గించడానికి వైద్య ఆరోగ్య సిబ్బంది అందరూ కృషి చేయాలన్నారు. దీనికోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ కృష్ణారావు, డిప్యూటీ డెమో రవి, వైద్యాధికారులు, డ్రగ్ అడిక్షన్ సెంటర్ సిబ్బంది, పాడేరు ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ విద్యార్థినీలు, ఆశా వర్కర్లు కమ్యూనిటీ ఆరోగ్య కార్యకర్తలు, నైస్ ఫౌండేషన్ స్టాఫ్, డిస్ట్రిక్ట్ ఎన్‌టిపిసి సోషల్ వర్కర్స్ పాల్గొన్నారు.

పోలవరం పాదయాత్రను జయప్రదం చేయండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి.-చింతూరు : .పోలవరం నిర్వాసితులు, ముంపు బాధితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచితలపెట్టిన పోలవరం పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఎర్రంపేటలో నిర్వహించిన సన్నాహక వర్క్ షాప్‌లో మాట్లాడుతూ, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితుల పట్ల నిర్లక్ష్యపూరితమైన దుర్మార్గమైన విధానాలు అవలంభిస్తున్నాయని మండిపడ్డారు. బాధితులకు పునరావాసం, ప్యాకేజీ, పరిహారం చెల్లించకుండానే ప్రాజెక్టు పనులు చేపట్టడం దుర్మార్గమన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నిర్వాసితులు, ముంపు బాధితులు లక్షలాదిమంది ప్రజానీకం అవస్థలు పడుతున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదని విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు



హాజరైన సిపిఎం ప్రతినిధులు, సానుభూతిపరులు

గతేడాది ముంపు మండలాల్లో సంభవించిన గోదావరి వరదలకు ప్రజానీకం తీవ్రంగా నష్టపోయారన్నారు. ముంపు బాధితులకు కనీసం పరిహారం, ఆదుకునే చర్యలను ప్రభుత్వాలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాయన్నారు. కాపర్ డ్యాం బ్యాక్‌వాటర్ ప్రభావంతో 11 మండలాల్లో ముంపు సమస్య తీవ్రంగా ఉండి, నిర్వాసితులు సర్వస్వం కోల్పోయి, ఏటా నానా అవస్థలు పడుతున్నా ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం చీమకుట్టినట్టయినా స్పందించపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.బాధితుల్లో కేవలం కొద్దిమందికి మాత్రమే కంటి తుడుపు చర్యగా వరద సాయంగా కుటుంబానికి రూ.రెండు వేలు అందించిచేతులు దులుపుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో ముంపు మండలాల నుంచి అమరావతి వరకు చేపట్టే సిపిఎం పాదయాత్రలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

తెలుగుదేశం కార్యకర్తలకు ఆర్థిక సాయం



ఆర్థికసాయాన్ని అందిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -మారేడుమిల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని వేటుకూరు పంచాయతీ పందిరి మామిడికోట గ్రామంలో తెలుగుదేశం పార్టీ నేత కత్తుల సోమ సుందర్‌రెడ్డి, అలాగే మారేడుమిల్లి గ్రామంలో కారం మంగయ్యలకు పార్టీ నేతలు, కార్యకర్తలు అండగా నిలిచారు. టిడిపి కుటుంబసభ్యులు అనారోగ్యంతో బాధపడుతున్న సమచారం తెలుసుకుని, పార్టీ రంపచోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.పదివేలు చొప్పున ఇద్దరికీ రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యం ఖర్చు కోసం పార్టీ తరపున సాయం అందించామన్నారు.

బాధితులకు సాయం అందజేసిన తెలుగుదేశం పార్టీ మారేడుమిల్లి మండల అధ్యక్షుడు గురుకు శేషు కుమార్, ప్రధాన కార్యదర్శి పోడియం శ్రీనుబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులు ఆర్థిక ఇబ్బందులు. అనారోగ్యంతో బాధపడుతుంటే తమకు తెలియజేయాలని, కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ ఎపుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు కార్యక్రమంలో అందాల సూర్యనారాయణ రెడ్డి, ఎంపిటిసి కొరగాని సువర్ణ రాజు, మల్లుల శివన్నారాయణ, రేవుల జానకిరెడ్డి, రత్నాజీ, కాశగాన వంశీకృష్ణ, పెద్దకంశెట్టి రాము, రేవుల సోమాలమ్మ, కత్తుల సాంబశివారెడ్డి, కత్తుల చిరంజీవి రెడ్డి పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న మహిళా నాయకులు

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మహానాడులో టిడిపి ప్రకటించిన మ్యానిఫెస్టోలో మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ బండలు, ప్రతి నెల రూ 1500లతో పాటు బస్సులో ఉచిత ప్రయాణానికి ప్రకటించడంతో ఆ పార్టీ మహిళ అధ్యక్షురాలు ఎం.జానికమ్మ, ఎంపిటిసి ఎం.గీత ఆధ్వర్యాన బుధవారం చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు, సీనియర్ నాయకుడు కె.సుబ్బారావు, టిఎన్‌టియుసి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి -కొయ్యూరు : జూన్, జులై నెలల్లో వర్షాలతోపాటే సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉన్నందున ప్రజలంతా తగు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని అల్లూరి యువ గిరిజనసేవా సంఘం అధ్యక్షులు టి మల్లేష్ అన్నారు. బుధవారం కొయ్యూరు మండలం చిట్టింపాడు పంచాయతీ మారుమూల గ్రామమైన లింగాపురంలో అల్లూరి యువ గిరిజన సేవా సంఘం ఆధ్వర్యంలో 'మన ఆరోగ్యం మన చేతుల్లోనే కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ, సీజన్‌లో ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు అవసరమని, వేడి నీరు, వేడి ఆహారం తీసుకోవాలని, దోమల బెడద నుంచి తప్పించుకోవడానికి దోమ తెరలను వాడడంతోపాటు దోమల నియంత్రణకు ఇంటిపరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.

జ్వరం వచ్చిన వెంటనే అశ్రద్ధ చేయకుండా వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యులను చూపించుకోవాలని, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్ల సూచనలకు అనుగుణంగా మందులు వాడాలని సూచించారు అత్యవసర పరిస్థితుల్లో ఎవరికైనా వైద్యం,



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న మల్లేష్


ఇతరత్రా సాయం అవసరమైతే తమను సంప్రదిస్తే, అల్లూరి గిరి యువజనసేవా సంఘం ఆధ్వర్యంలో సాయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో చదువుకున్న యువతను సత్కరించారు. యువతకు వాలీబాల్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో సేవా సంఘం కోశాధికారి పి చిట్టయ్య, స్థానిక నాయకులు పేట్ల గాంధీ, గున్నమ్మ, లింగాపురం వాలంటీర్ రాజు, యూత్ లీడర్ కూడా సత్తిబాబు, అప్పన్నబాబు, దారకొండ పెద్దలు, యువత పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

వైద్యానికి ఎపి జెన్‌కో సహకారం

ప్రజాశక్తి -సీలేరు: ఆంధ్రాఒడిశా సరిహద్దుల్లో గిరిజన మహిళ పాముకాటుకు గురై తీవ్ర అస్వస్థతకు గురైంది. వివరాలివి. గుంటువాడ పంచాయతీకి చెందిన వంతల నాగమ్మ మంగళవారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పాము కాటేసింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అప్రమత్తమై సీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య సేవలకు తీసుకొచ్చారు. సీలేరు పిహెచ్‌సిలో పాముకాటు వ్యాక్సిన్ లేకపోవడంతో చింతపల్లి ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. అయితే చింతపల్లి తీసుకెళ్లేందుకు బాధిత మహిళ కుటుంబసభ్యులు నిరాకరించి, తమ గ్రామానికి తీసుకుపోతాయమని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న ఎపి జెన్‌కో యంత్రాంగం వెంటనే స్పందించి, బాధిత మహిళను ఎపి జెన్‌కో సిఆర్ఎస్ అంబులెన్సులో వైద్యసిబ్బంది సాయంతో ఒడిశాలోని చిత్రకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మల్కన్‌గిరి ప్రభుత్వ ఆసుపత్రికి మెరుగైన వైద్యసేవ కోసం తరలించేందుకు ఎపి జెన్‌కో వైద్య సిబ్బంది సహాయ సహకారాలు అందించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



నీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి లలిత కుమారి

ప్రజాశక్తి -మారేడుమిల్లి: గిరిజన గ్రామాలలో తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపిపి సార్ల లలితకుమారి అన్నారు. బుధవారం మండలంలోని సున్నంపాడు పంచాయతీ నూరుపూడి గ్రామంలో రూ 19 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న వాటర్ ట్యాంకుకు ఆమె పార్టీ నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నీటి పథకం నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టి, త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, మండల కార్యదర్శి బొడ్డేటి గంగరాజు, సున్నంపాడు సర్పంచ్ వెలుగురి చిన్న లచ్చిరెడ్డి, ఎంపిటిసి సభ్యుడు మడకం అనిల్‌కుమార్ ,నాయకులు సార్ల లింగారెడ్డి, మడకం రామన్న దొర, గ్రామస్తులు పాల్గొన్నారు



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

సంతకాల సేకరణ

ప్రజాశక్తి-దుంబ్రిగూడ:బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ బుధవారం కాంగ్రెస్ పార్టీ పిసిసి ప్రతినిధి చిన్నస్వామి ఆధ్వర్యంలో కించుమండ వారపు సంతలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందిన వారిని చేర్చడంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోతారన్నారు. జీవో 3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి టి.భీమారావు, నాయకులు పాల్గొన్నారు.



గ్యాస్ గొడౌన్‌ను పరిశీలిస్తున్న పిఒ

గ్యాస్ గొడౌన్‌కు ఎన్‌ఒసి జారీ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని కించుమడలో నూతనంగా నిర్మించిన గ్యాస్ గొడౌన్‌ను ఐటీడీఏ పీఓ అభిషేక్ బుధవారం పరిశీలించి ఎన్‌ఓసిని జారీ చేసారు. గ్యాస్ గొడౌన్‌ను వెంటనే పూర్తి చేసి గిరిజనులకు అందుబాటులో సేవలు అందించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



కుర్చీలాట ఆడుతున్న విద్యార్థులు

మ్యూజికల్ చైర్ పోటీలు

ప్రజాశక్తి-దుంబ్రిగూడ:స్థానిక గ్రంధాలయంలో బుధవారం చిన్నారులకు మ్యూజికల్ చైర్ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 20 మంది చిన్నారులు పాల్గొన్నారు. అనంతరం గ్రంధాలయ అధికారిని ఎస్.సునీత మాట్లాడుతూ, ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువ ఉండడంతో వడదెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు. చిన్నారులు బయటకు వెళ్లకుండా ఉండేందుకు సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సిబ్బంది కెసుబ్బారావు ,చిన్నారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

మోడీ పాలనలో బాగుపడ్డ కార్పొరేట్లు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తొమ్మిదేళ్ల మోడీ పాలనలో ఓ పక్క భారతదేశం బాగా వెనుకబడిందని, అన్ని తరగతుల ప్రజలూ తీవ్ర ఇక్కట్లకు గురయ్యారని, మరోపక్క అదానీ, అంబానీల కార్పొరేట్ సంస్థలు మాత్రం బాగుపడ్డాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ అన్నారు. బుధవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రయత్నిస్తూ వస్తోందన్నారు. అవినీతిని అంతం చేస్తామని చెప్పిన మోడీ వందల వేల కోట్లు దేశ సంపదను అక్రమంగా దోచుకొని విదేశాలకు పారిపోయిన 28 మంది బడా కార్పొరేట్ సంస్థల వ్యక్తులను ఏమీ చేయలేకపోయారని విమర్శించారు. వీరిలో ఒకరు మినహా మిగిలిన 27 మంది మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌కు చెందిన వారిని అన్నారు. మోడీ పాలనలో బిజెపి కార్యకర్తలకు కూడా ఎటువంటి మేలూ జరగలేదన్నారు. నూతన పార్లమెంటు భవనం ప్రారంభానికి రాష్ట్రపతిని పిలవకపోవడం శోచనీయమన్నారు. మోడీ అప్రజాస్వామిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ దేశవ్యాప్తంగా అన్ని ప్రతిపక్ష పార్టీలూ ఐక్యం కావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 12న బీహార్ రాజధాని పాట్నాలో బిజెపి మినహా అన్ని పార్టీలతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలన తిరోగమనంగా ఉందన్నారు. ఆదాయం బాగా తగ్గిందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, నాయకులు క్షేత్రపాల్ రెడ్డి పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఉష

నేటి నుంచి శంకర్ ఫౌండేషన్‌లో మరిన్ని సేవలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మద్దిలపాలెంలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సామాజిక సేవలో భాగంగా జూన్ 1 నుంచి 30 వరకు సీనియర్ సిటిజన్లు, తెల్లరేషన్ కార్డుదారులకు ఉచిత కన్సల్టేషన్ వైద్య సేవలు అందిస్తున్నట్లు శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఇంచార్జ్ ఉష ఆత్మకూరి తెలియజేశారు. బుధవారం ఆసుపత్రి సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉచిత కన్సల్టేషన్ సేవలు అందించడంతోపాటు దీనికి అదనంగా ఆసుపత్రిలో ఫార్మసీపై 10 శాతం తగ్గింపు, ఆప్టికల్స్‌పై 15 శాతం తగ్గింపు ఉంటాయన్నారు. కంటి శుక్లం శస్త్రచికిత్సల ప్యాకేజీలపై 10 శాతం తగ్గింపు ఉంటుందన్నారు. కంటి వ్యాధులను గుర్తించడానికి క్రమం తప్పకుండా అందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. ఆసుపత్రి సీనియర్ నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ రష్మి రత్, ఆసుపత్రి పిఆర్, లైసెన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు పాల్గొన్నారు.

గిరిజనేతరుల పట్టాలు రద్దుచేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:రోలుగుంట మండలంలో గిరిజనేతరులకు ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని స్థానిక ఆర్డిఓ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కే గోవిందరావు మాట్లాడుతూ, రోలుగుంట మండలం పనసలపాడు రెవెన్యూ పరిధిలో 12 కుటుంబాలు ఎస్టీ భగత తెగలకు చెందిన వారు గత 50 సంవత్సరాల నుండి ఇదే గ్రామంలో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, అటువంటి వీరి భూములను గిరిజనేతరులకు ఇవ్వడం దారుణమ న్నారు. గిరిజనుల భూముల్లో జగనన్న భూ రీ సర్వే పేరుతో సర్వేలు చేసి గిరిజనేతరులకు పట్టాలు పంపిణీ చేయడం జరిగిందని, గిరిజనుల పేరుతో రికార్డులు ఉన్నాయని, అలాంటిది గిరిజనేతలకు పట్టాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. సర్వే నెంబర్ 6-9లో 1-43 సెంట్ల భూమి తమటాపు సత్యనారాయణ మాజీ సర్పంచ్ పేరు మీద పట్టా ఇచ్చారని, ఇది ఎలా సాధ్యపడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 6-1లో పది మంది ఆదివాసి గిరిజనులు 50 సంవత్సరాల నుంచి భూములు సాగు చేస్తున్నారని, పట్టాలు మాత్రం సాగులో లేని భగవతి మైథిలి కుమారి పేరు మీద పట్టాదారు పాస్ పుస్తకాలు ఎలా ఇచ్చారో అధికారులకే తెలియాలన్నారు. పనసలపాడు గ్రామంలో గ్రామసభ పెట్టలేదని, (డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్)డిఎల్ఆర్ లబ్ధిదారులకు తెలియపరచకుండా రికార్డులు తయారు చేసేశారన్నారు.తప్పుడు పద్ధతిలో గిరిజన భూముల్లో గిరిజనేతలకు ఇచ్చిన పట్టాలు రద్దు చేయాలని, రోలుగుంట తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సమగ్రమైన విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డిఓ అధికారులకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గేమిల చిన్నబ్బాయి, గేమిలా నూకినాయుడు, గేమిల మెచ్చుకొండ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కూలి పెంచాలి

ప్రజాశక్తి-నక్కపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. మండలంలో దోనివాని లక్ష్మీపురం గ్రామంలో బుధవారం ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా చట్టంలో ఉన్న సదుపాయాలు తగ్గించి ఇష్టానుసారం వ్యవహరిస్తుందన్నారు. ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లు తగ్గించి, కేవలం రూ.70 వేల కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో రెండు లక్షల కోట్లు నిధులు పెంచాలని, సంవత్సరానికి 200 రోజులు పని, రోజు వేతనం 600 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా 30 శాతం వేసవి అలవెన్స్, మంచి నీరు, పార, గుణపం, తట్టలకు డబ్బులు, నీడకు టెంట్లు, మెడికల్ కిట్లు వంటి వాటిని సమకూర్చాలన్నారు.పే షిప్‌లు ఇచ్చి ప్రతివారం పేమెంట్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు భరణికల రాము, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.నానాజీ, రైతు సంఘం మండల అధ్యక్షులు గింజాల శివాజీ, మరిణియ్య, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

పోలీస్ స్టేషన్‌కు చేరిన ప్రశ్నాపత్రాలు

ప్రజాశక్తి -నక్కపల్లి :జూన్ 2 వ తేదీ నుండి నక్కపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత కేంద్రం గా ప్రారంభమవుతున్న పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల ఛీఫ్ సూపరింటెండెంట్ రాణీలలిత అన్నారు. ప్రతీరోజూ ఉదయం 9.30గంటల నుండి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు అరగంట ముందుగానే చేరుకోవాలని, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్ సదుపాయాలతో పాటు వేసవి ఎండ తీవ్రతను దృష్టిలో నుంచుకుని వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బుధవారం ప్రశ్నాపత్రాలు నక్కపల్లి చేరుకోవడంతో పరీక్షా సామగ్రిని పోలీస్ స్టేషనులో భద్ర పరిచామన్నారు. గురువారం పరీక్ష లకు హాజరయ్యే ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 8 వరకు పరీక్షలు జరుగుతాయని, కేంద్రాల వద్ద 144 సెక్షను అమలులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్షా విభాగాధిపతి వై.అప్పారావు, ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, గురుకుల పాఠశాల పరీక్షాధికారులు పాల్గొన్నారు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమైన ఇంటర్ పబ్లిక్ అడ్వాన్స్ డే సప్లమెంటరీ పరీక్షలు బుధవారంతో ముగిసాయని కళాశాల ప్రిన్స్‌పాల్ బి.సాయికుమార్ తెలిపారు. గత మార్చిలో జరిగిన ఇంటర్ పరీక్షలలో తప్పిన విద్యార్థులకు ఈ నెల 24 నుండి 31 వరకు ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో మొదటి, రెండవ సంవత్సరాల జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 1371 మంది విద్యార్థులు పరీక్షలలో హాజరు కావలసి ఉండగా 1343 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

రేపటి నుండి పున్న ప్రారంభం

రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 1 నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో తరగతులు ప్రారంభం కానున్నాయని, అందుకు తగిన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న సందర్భంగా కళాశాలలో తొలి విడత జాయినింగ్ పక్రియ జూన్ 15 వరకూ కొనసాగుతుందని ప్రిన్స్‌పాల్ సాయికుమార్ వివరించారు.

విద్యాశాఖపై విధుల గుదిబండ !

టీచర్లు, సిబ్బందిపై నానాటికీ పెరుగుతున్న పనిభారం

అడుగడుగునా రాష్ట్ర అధికారుల పర్యవేక్షణలు, వెబెక్స్‌లే

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నూతన జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో పనిచేసే ఎంఆర్‌సి సెంటర్లపైనా, సిబ్బంది, స్కూల్ టీచర్లపైనా అనేక రకాల పనుల భారాన్ని మోపడం విశాఖ జిల్లాలో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల అకస్మిక తనిఖీలు, పర్యవేక్షణలతో జిల్లాలో విద్యా వ్యవస్థ అట్టుడుకుతోందనే చెప్పొచ్చు. సస్పెన్షన్‌లు, మెమోలు సర్వసాధారణమైపోయాయి. ఒకప్పుడు విద్యాశాఖ అంటే ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే క్రమంలో బడి బయట ఉన్నవారిని బడుల్లో చేర్పించడం, పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దడంగా ఉండేది. స్కూళ్లకు బట్టలు, పుస్తకాల పంపిణీ వంటివి ఏడాదికో దఫా అందేవి. 2019లో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్ తన ప్రభుత్వంలో విద్యారంగంలో పలు మార్పులు చేశారు. కేంద్రంలోని బిజెపి సర్కారు విద్యను కాషాయీకరణ చేసే క్రమంలో మాతృభాషకు మంగళం పలకడం ద్వారా అంతా హిందీ, ఇంగ్లీషు అనే పద్ధతిని ముందుకు తీసుకెళ్లాలనే పథకం కూడా అందులో దాగి వుంది. రాష్ట్రంలో నూతన విద్యా విధానాన్ని అమలు చేసే ప్రక్రియకు జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టడమే కాకుండా దూకుడుగా ముందుకెళ్తోంది. తాజాగా విశాఖ జిల్లానే తీసుకుంటే.. విద్యాశాఖ లక్ష్యాలతో ఆయా అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులకు కంటిమీద కునుకు ఉండటం లేదు. పలువురు ప్రధానోపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురౌతున్నట్లు తెలుస్తోంది. అనేక విధులతో విద్యా సంవత్సరం గుదిబండలా మారిపోయిందని, బోధనేతర పనులు అధికమయ్యాయని టీచర్లు గగ్గోలు పెడుతున్నారు. మండలాల్లో ఎంఆర్‌సి సెంటర్లలో పనిచేసే సిఆర్‌పి, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్, డేటా ఎంట్రీల పరిస్థితి ఇందుకేమీ తీసిపోవడం లేదు. వీరిపైనా నిరంత పనుల భారాన్ని జిల్లా, రాష్ట్ర స్థాయి విద్యాశాఖ అధికారులు మోపుతున్నారన్న విమర్శలు నానాటికీ పెరుగుతున్నాయి.

పలు పథకాలతో తలమునకలు

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ జిల్లాలోని అన్ని స్కూళ్లకు ఎంఆర్‌సి సెంటర్లు, హై స్కూళ్ల ద్వారా శరవేగంగా సాగుతోంది. విద్యార్థులకు యూనిఫారాలు, షూలు, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, డిక్షనరీలు వంటివాటితో ఈ కిట్లు పంపిణీ కార్యక్రమం సాగే క్రమంలో అవి స్కూళ్లకు చేరే విధానంపై ఈ శాఖలో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. కొన్నిచోట్ల కిట్లు పంపిణీ సక్రమంగా జరగకపోవడంతో రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లాలో పర్యటనలు చేస్తూ వణుకు పుట్టిస్తున్నారు. 'నాడు-నేడు' పనుల ప్రగతిపై నిరంతర నివేదికలు, వెబ్‌సైట్‌లో పనుల అప్‌లోడింగ్ విధానం బాధ్యతను ప్రధానోపాధ్యాయుల నెత్తిన ప్రభుత్వం పెట్టిన విషయం తెలిసిందే. దీంతో వారూ సతమతమవుతున్నారు. మండలాల్లో ఎంఆర్‌సి సెంటర్ల ద్వారా పని జరిగేలా నియంత్రణ చేయడం నిత్యకృత్యంగా సాగుతోంది. తాజాగా టీచర్ల బదిలీలు కూడా మండలాల్లోని ఎంఆర్‌సి సెంటర్లకు గుదిబండగా మారాయనే చెప్పొచ్చు. ఆయా ప్రాంతాల్లో ఏర్పడిన ఖాళీలు, టీచర్లు ఎక్కడ నుంచి ఎక్కడకు వెళ్లి పనిచేయాలని కోరుకున్నా వాటి జాబితాలను మండలాలే సిద్ధం చేసేలా సిబ్బందిపై ఒత్తిడి కొనసాగుతోంది. పై అన్నింటిపైనా పర్యవేక్షణలో భాగంగా టెలీ కాన్ఫరెన్సులు, వెబెక్స్‌లతో తలకు మించిన భారం వీరిపై పడుతోంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిఇ 12సి ఫ్రీ ఎడ్యుకేషన్ పేరిట ఓ విధానాన్ని తీసుకొచ్చింది. దీనికోసం రూపొందించబడ్డ రాష్ట్ర స్థాయి నిబంధనలు జిల్లా విద్యాశాఖ అధికారుల్లో గందరగోళానికి తెరతీశాయి. తొలుత 25 శాతమే పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యాలయాల్లో అవకాశం అంటూ వెల్లడించారు. తర్వాత అమ్మఒడి డబ్బులు కార్పొరేట్ స్కూళ్లకు ఇచ్చేయాలనే విధానం తీసుకున్నారు. తాజాగా మొత్తం ఫ్రీ ఎడ్యుకేషన్ అంటున్నారు. దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. మండలాల్లోగల ఎంఆర్‌సి సెంటర్లలోని సిబ్బందిపైనే ఈ నూతన విధానం పని భారమూ పడనుంది.

ఉపాధి చట్టాన్ని రక్షించుకోవాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉపాధి కూలీలంతా ఐక్యంగా పోరాడి మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. బుధవారం ఉదయం కశింకోట మండలం, తేగాడలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లకుపైగా ఉపాధి చట్టానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిధులు తగ్గించడంతో కూలీలకు పనిదినాలు తగ్గుతాయన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రధాని మోడీ ప్రభుత్వ కుట్రలను పోరాటాలతో తిప్పికొట్టి రక్షించుకోవాలన్నారు. కేరళలోని సిపిఎం నాయకత్వాన వామపక్ష ప్రభుత్వం రోజు కూలీ రూ.730 చెల్లిస్తోందన్నారు. ఉపాధి పనులు ఏడాదికి 200 రోజులు కల్పించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ రోజుకు రూ.600కు తగ్గకుండా కూలీలకు వేతనం చెల్లించాలన్నారు. కూలీలకు గతంలో వలె పనిముట్లు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు వరలక్ష్మి పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నర్సింగరావు

నేరాలు ఘోరాలు



నిందితులతో పోలీసులు

గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని లబ్బూరు జంక్షన్ వద్ద బొలెరో వాహనంలో తరలిస్తున్న 310 కేజీల గంజాయిని స్థానిక ఎస్సై రవీంద్ర, సిబ్బంది పట్టుకున్నారు. పట్టుబడ్డ ముగ్గురు నిందితులు ఒడిశా రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించారు. గంజాయిని వారు ముంచింగిపుట్టు మీదుగా ఒడిశా రాష్ట్రానికి తరలిస్తుండగా పట్టుకున్నామని పోలీసులు వెల్లడించారు. గంజాయి విలువ సుమారు రూ.6,20,000 ఉంటుందని స్థానిక ఎస్సై రవీంద్ర అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ తిరుపతిరావు, మరో కానిస్టేబుల్ పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -పాయకరావుపేట:పాయకరావుపేట ఇందిరా కాలనీకి చెందిన జల్లి లోకేష్ (22) తన ఇంటిలో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య పాల్పడి, తుని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై జోగారావు తెలిపారు. పోలీస్‌ల కథనం మేరకు.. జల్లి లోకేష్ బీటెక్ పూర్తి చేసుకుని ఇంటి వద్ద ఉంటున్నాడు. జేఎన్టీయూలో చదువుతున్న సమయంలో ఒక అమ్మాయిని ప్రేమించి ఆమెతో మనస్పర్ధలు వచ్చిన కారణంగా ఉరి వేసుకుని చనిపోయినట్లు తల్లి జల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై జోగారావు తెలిపారు.

వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- ఎస్.రాయవరం:మండలంలో పెద్ద గుమ్ములూరు గ్రామంలో బుధవారం గోకులపాడు గ్రామానికి చెందిన సమ్మంగి బాబ్జి మద్యం తరలిస్తుండగా పోలీసులు అరెస్టు చేసారు.13 మధ్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ ప్రసాద్ రావు తెలిపారు.

7న గంటం దొర వర్ధంతి

ప్రజాశక్తి-గొలుగొండ: అల్లూరి సీతారామరాజు పితూరి సేనాధిపతి గాం గంటం దొర 99వ వర్ధంతి కృష్ణదేవిపేటలోని అల్లూరి స్మారక పార్కులో ఈనెల 7న జరుప తలపెట్టినట్లు జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు తెలిపారు.బుధవారం ఆయన కష్ణదేవిపేటలోని అల్లూరి స్మారక పార్కుని సందర్శించారు. ఈ సందర్భంగా గంటం దొర కుటుంబీకులను ఘనంగా సత్కరించడం జరుగుతుందన్నారు. చింతపల్లి, కృష్ణదేవిపేట, రాజవొమ్మంగి, అడ్డతీగల, రంపచోడవరం, అన్నవరం పోలీస్ స్టేషన్లపై దాడిలో గంటం దొర కీలకపాత్ర పోషించారని తెలిపారు. గంటం దొర కుటుంబీకులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కుటుంబంలోని అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని పడాల వీరభద్రరావు డిమాండ్ చేశారు. ఆయన వెంట జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యనిర్వాహకురాలు శ్యామల, వరలక్ష్మి, కార్యదర్శి అంబటి వరహాలరాజు ఉన్నారు.

ఎస్‌పి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: జిల్లా విడిపోయిన తరువాత నర్సీపట్నంలో ఐపిఎస్ అధికారిని నియమించలేదు. ఇప్పటి వరకు అనకాపల్లి ఇంచార్జ్ డిఎస్పి మాత్రమే ఉండే వారు. నర్సీపట్నం ఎఎస్‌పిగా అధిరాజ్ సింగ్ రాణా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సంధర్భంగా ఆయనకు స్థానిక పోలీసులు స్వాగతం పలికారు. ఆయన గతంలో కర్నూలు జిల్లా ఆదొనిలో పని చేశారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ, గంజాయి రవాణా, నిర్మూలన, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

వడదెబ్బ తగలకుండా అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విశాఖ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆఫ్ ది డెఫ్ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దాదాపు రెండు మాసాలుగా చలివేంద్రాన్ని నిర్వహిస్తున్న వారు బుధవారం మీడియాతో మాట్లాడుతూ చెవిటి, మూగ వల్ల తాము చదువుకున్నప్పటికీ నిరుద్యోగులుగా మిగిలి ఉన్నామన్నారు. వేసవిలో రోజురోజుకూ ఎండలు తీవ్రమవుతున్న తరుణంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు తమ సంస్థ ద్వారా చలివేంద్రాన్ని ప్రారంభించామని అన్నారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాదక ద్రవ్యాల నిరోధానికి పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కాలేజీలు, హాస్టళ్లు, హోటళ్లలో అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి విద్యార్థులు మత్తు పదార్థాల వాడకాన్ని పూర్తిగా కట్టడి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్‌లోని తన ఛాంబర్‌లో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రాఫిక్ సబ్స్టాన్సస్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, అందుకుగల కారణాలను విశ్లేషించి కట్టడి చేయాలని పోలీస్, ఎస్ఇబి అధికారులను ఆదేశించారు. అన్ని కాలేజీల యాజమాన్యాలు తరచుగా తమ కాలేజీ ఆవరణలో మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, విద్యార్థులను మత్తు పదార్థాలకు దూరంగా ఉండేటట్లు కౌన్సిలింగ్ చేయాలని అన్నారు. గంజాయి, డ్రగ్స్ రవాణా చేసే వారిని జోన్ల వారీగా విభజించి, వారందరినీ కౌన్సిలింగ్ సెంటర్లకు పిలిచి మాట్లాడాలన్నారు. అప్పటికీ మారకపోతే పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్స్ ప్రభావం వల్ల విద్యార్థుల తల్లిదండ్రుల ఆశలు అడియాశలవుతున్నాయని, వాటి బారిన పడితే భవిష్యత్తు అంధకారం అవుతుందని అన్నారు. తల్లిదండ్రులు యుక్త వయసులో ఉన్న తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాల అలవాటు మానుకోలేని వారిని డి అడిక్షన్ సెంటర్లకు పంపి కౌన్సిలింగ్ ఇవ్వాలని అన్నారు. డ్రగ్స్ వినియోగాన్ని తక్షణమే గుర్తించేందుకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్, పోర్ట్, కోస్ట్ గార్డ్, మెడికల్, విద్యా శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. డిసిపి విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగానికి వ్యతిరేకంగా జివిఎంసిలోని ఆటో యూనియన్లతో సమావేశాలు నిర్వహించామని తెలిపారు. ఆర్టీసీ బస్సుల ద్వారా ఒడిశా నుంచి విశాఖకు అధికంగా గంజాయి వస్తున్నట్టు గుర్తించామన్నారు. అంతకు ముందుగా అడిషనల్ సూపరింటెండెంట్ ఎస్ఇ బిబి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జనవరి 1 నుండి ఈ నెల 30 వరకు 474 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం 183 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. సమావేశంలో ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, బి.శ్రీనాధుడు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యం కీలకం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జీవితంలో ఎంత ఎదిగామనేది ముఖ్యం కాదని, ఎంత ఆరోగ్యంగా ఉన్నామన్నదే కీలకమని ఎయు మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్కయ్యపాలెంలోని కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ధూమపానం నివారణపై అవగాహన కల్పించారు. రాజుల కాలం నుంచి ఇప్పటివరకు వినియోగించే వివిధ రకాల సిగిరెట్ యాష్ట్రేస్‌ల ప్రదర్శన చేపట్టారు. బ్యాంకు ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వ్యతిరేక దినోత్సవం ఒక్కరోజు కాదని, నిరంతర ప్రక్రియగా పాటించాలని, తద్వారా తమ ఆరోగ్యంతో పాటు కుటుంబ సభ్యులు, ఎదుట వారి ప్రాణరక్షణకు కూడా దోహదపడాలన్నారు. ధూమపానం నిషేదంపై ప్రభుత్వాలు కఠినచర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ కె.శ్రీలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా వ్యవహరిస్తేనే ధూమపానాన్ని నిషేదించడం సాధ్యపడుతుందన్నారు. బ్యాంకు ఛైర్మన్ కె.రాంబాబు మాట్లాడుతూ సిబ్బంది, ఖాతాదారులకు ధూమపాన నిషేదంపై అవగాహన కల్పించాలనే సదుద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ధూమపానానికి దూరంగా ఉండాలని, ఎవరి ఆరోగ్యాన్ని వారే పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఉద్యోగి జిఎస్.శివప్రకాష్ సేకరించిన వివిధ రకాల యాష్ట్రేలు, ఇతర పురాతన ధూమపాన వస్తువులు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బ్యాంకు వ్యవస్థాపక ఛైర్మన్ పరుచూరి రఘునాథరావు, డైరెక్టర్లు బి.నాగేశ్వరరావు, ఎస్.ఆంజనేయులు, ముఖ్య కార్యనిర్వాహణాధికారి కె.శ్యామ్‌కిషోర్ పాల్గొన్నారు.